సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

మూటల మాటున
మెడికల్ వేస్ట్

ముడసర్లోవ మినీ డంపింగ్ యార్డు ఆస్పత్రుల బయో–మెడికల్ వ్యర్థాలకు నిలయంగా మారుతోంది. ఇవి డంపింగ్ యార్డు పక్కనే ఉన్న రిజర్వాయర్‌ను ప్రమాదకరంగా మార్చుతోంది. దానిలోని తాగునీటిని కలుషితం చేస్తోంది. ఆరిలోవ హెల్త్‌సిటీలోని ఆస్పత్రుల నుంచి ఉత్పన్నమవుతున్న మెడికల్ వ్యర్థాలను మూటల్లో తీసుకొచ్చి ఇక్కడ డంప్ చేస్తున్నారు. దీంతో స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



- ముడసర్లోవ డంపింగ్ యార్డులో ఆస్పత్రుల వ్యర్థాలు
- కలుషితమవుతున్న రిజర్వాయర్ నీరు
- కార్యరూపం దాల్చని తరలింపు హామీ
- చుట్టుపక్కల ప్రాంతాల వాసుల్లో ఆందోళన

ఆరిలోవ: ముడసర్లోవలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేసినప్పటి నుంచి వివాదంగానే మారింది. పచ్చని కొండల మధ్య నీటి పరీవాహక ప్రాంతంలో తాత్కాలికంగా అంటూ సుమారు 9 ఏళ్ల కిందట ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు జీవీఎంసీ అధికారులతో కలిసి డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారు. అప్పట్లో దీనికి సమీపంలోని రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం, ఆరిలోవ కాలనీల ప్రజలు, పలువురు పర్యావరణ కార్యకర్తలు డంపింగ్ యార్డు ఇక్కడ వద్దంటూ ధర్నాలు చేపట్టారు. ఆరిలోవ ప్రాంతానికి తాగునీటిని అందించే ముడసర్లోవ రిజర్వాయర్ వ్యర్థాలతో కలుషితమయ్యే ప్రమాదముందని నాడు వారంతా హెచ్చరించినా.. ఎమ్మెల్యే, అధికారులు వారి నిర్ణయాన్ని వెనక్కి తీసుకోలేదు. ఒకటి, రెండేళ్లలో వేరే చోటకు తరలిస్తామని హామీ ఇచ్చి డంపింగ్ యార్డును ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు సుమారు 9 ఏళ్లు గడిచినా దీన్ని తరలించే యోచన చేయలేదు సరికదా.. ప్రమాదకరమైన ఆస్పత్రుల వ్యర్థాలను సైతం ఈ యార్డులోనే డంప్‌చేస్తున్నా జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదు. వర్షాలు కురుస్తున్నప్పుడు ఆ వ్యర్థాలు నీటి ద్వారా ముడసర్లోవ రిజర్వాయర్‌లో కలుస్తున్నాయి. ఈ నీటినే వడకట్టి నీటి సరఫరా విభాగం అధికారులు ఆరిలోవ ప్రాంతానికి తాగడానికి కుళాయిలు, ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు.

రిజర్వాయర్‌లో కలిసిపోతున్న వ్యర్థాలు

డంపింగ్ యార్డులో కొన్ని రోజుల పాటు నిల్వ ఉన్న మెడికల్ వ్యర్థాలు దుర్వాసన రావడంతో పాటు వర్షాలు కురుస్తున్నప్పుడు వరద నీటితో కలిసి పక్కనే ఉన్న ముడసర్లోవ రిజర్వాయర్‌లో కలుస్తున్నాయి. దానిలోని నీరు కలుషితమవుతోంది. అదే నీటిని జీవీఎంసీ ముడసర్లోవ నీటి సరఫరా విభాగం అధికారులు ఆరిలోవ ప్రాంతానికి కుళాయిలు, ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. డంపింగ్ యార్డులో ప్రజల నుంచి నిత్యం సేకరిస్తున్న చెత్త, వ్యర్థాలను ఇక్కడ డంప్ చేస్తున్నారని, దానివల్ల తాగు నీరు కలుషితమవుతోందని గగ్గోలు పెడుతున్న ఆరిలోవ ప్రజలకు ఇప్పుడు హెల్త్‌సిటీ వ్యర్థాలు మరింత ప్రమాదకరంగా మారుతున్నాయి. ఈ వ్యర్థాలు రిజర్వాయర్‌లో కలవడంతో నీరు విషంగా మారుతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్ యార్డులో ఆస్పత్రుల వ్యర్థాలను ప్రతి రోజూ అనధికారికంగా వేస్తున్నప్పటికీ యార్డు ఇన్‌చార్జి, జోన్–2 ఏఎంహెచ్‌వో స్థాయి అధికారులు చూసీచూడనట్లు పోతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆస్పత్రుల వ్యర్థాలు ఇక్కడ వేయకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ముడసర్లోవ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.



ముడసర్లోవ డంపింగ్ యార్డు

వ్యానుల్లో తీసుకెళ్లి డంపింగ్

పెదగదిలి నుంచి చినగదిలి వరకు బీఆర్‌టీఎస్ రహదారిని ఆనుకొని హెల్త్‌సిటీలో పలు కార్పొరేట్, ప్రైవేట్ హాస్పిటళ్లు ఉన్నాయి. సుమారు 18 ఆస్పత్రులు పనిచేస్తున్నాయి. మరో 10 నిర్మాణంలో ఉన్నాయి. ఆయా ఆస్పత్రుల్లో రోగులకు అన్ని రకాల వైద్య సేవలు అందుతున్నాయి. అంతవరకు బాగానే ఉన్నా.. ఈ హాస్పిటళ్ల నుంచి వెలువడే వ్యర్థాలతోనే సమస్య మొదలైంది. ఇక్కడ ఉన్నవన్నీ పెద్ద ఆస్పత్రులు కావడంతో అన్నింటిలోను నిత్యం వందల కొలది వివిధ రకాలైన సర్జరీలు జరుగుతుంటాయి. వీటిలో రోగులకు సర్జరీలతోపాటు గాయాలకు చికిత్సలు, డ్రెస్సింగ్‌లు చేస్తుంటారు. సర్జరీలు చేసేటప్పుడు శరీరాల నుంచి వేరు చేసిన భాగాలు, కణితులు, వాటికి ఉపయోగించే క్లాత్‌లు, దూది(కాటన్), సిరంజిలు, కాలం చెల్లిన కొన్ని మందులు, ఖాళీ గ్లూకోజ్ బాటిళ్లు, వాటి సెట్లు రోజూ కుప్పలుగా చేరుతున్న వాటిని ఆస్పత్రుల్లో మూటలు కడుతున్నారు. వాటిని హెల్త్ సిటీలో సేకరించి ప్రత్యేక వ్యానుల్లో కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు తరలించి అక్కడ చెత్తలో కలపకుండా వేరేగా ఓ చోట వేసి దగ్ధం చేయాల్సి ఉంది. ఇక్కడ మాత్రం ఇలా జరగడం లేదు. ఆస్పత్రులకు అందుబాటులో ఉన్న ముడసర్లోవ డంపింగ్ యార్డుకు ఈ సర్జికల్ వ్యర్థాలను వ్యానుల్లో అనధికారికంగా తరలించేస్తున్నారు. వాటిని ఇక్కడ చెత్తలో డంప్ చేస్తున్నారు. ఆ వ్యర్థాలను ఎప్పటికప్పుడు బయటకు తరలించడం లేదు.



డంపింగ్ యార్డులో మెడికల్ వ్యర్థాలతో వ్యాను

ప్రజా రవాణాతో కాలుష్య నియంత్రణ



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి వస్తున్న మేయర్ హరివెంకటకుమారి

దాబాగార్డెన్స్: వారంలో ఒకరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా విశాఖ నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. ఆమె తన క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం జీవీఎంసీ కార్యాలయానికి ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా జీవీఎంసీ యంత్రాంగం వారంలో ఒక రోజు ప్రజా రవాణాను వినియోగిస్తున్నామన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక అనంతరం మేయర్ తిరిగి ఆర్టీసీ బస్సులో బంగ్లాకు వెళ్లారు. జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ బ్యాటరీ వాహనంలో కార్యాలయానికి చేరుకున్నారు.

మందుబాబులకు రూ.44,500 జరిమానా

పీఎం పాలెం: మద్యం తాగి ద్విచక్ర వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడిన వారికి న్యాయస్థానం రూ.44,500 జరిమానా విధించింది. ట్రాఫిక్ ఆర్ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాలిలా.. స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం తాగి ద్విచక్ర వాహనం నడుపుతున్న 25 మందిపై కేసులు నమోదు చేశారు. వారిని సోమవారం న్యాయస్థానం ముందు హాజరు పరచగా.. ఒక్కొక్కరికీ రూ.2,000 నుంచి రూ.3,000 చొప్పున మొత్తం రూ.44,500 అపరాధ రుసుం విధించినట్లు ఆర్ఎస్ఐ తెలిపారు.

క్లుప్తంగా

పేదలకు ఆహార పొట్లాల పంపిణీ



పేదలకు ఆహార పొట్లాలు అందిస్తున్న ఆనంద్‌మార్గ్ ఆశ్రమ ప్రతినిధులు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు పాత డెయిరీ ఫారం సమీపం ఇందిరాగాంధీనగర్‌లోని ఆనంద్‌మార్గ్ ఆశ్రమ అనుబంధ సంస్థ అమృత్ విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు సోమవారం పేదలకు ఆహారం పొటాల్ల పంపిణీ చేశారు. హనుమంతవాక, ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్, జగదాంబ తదితర ప్రాంతాల్లో రోడ్డు పక్కన పేదలకు ఆహారం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సంస్కృత భాషా దినోత్సవం



సత్యవాడ సత్యనారాయణను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్య ప్రతినిధులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని గాయత్రి డిగ్రీ కళాశాలలో సోమవారం సంస్కృత భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఏయూ విశ్రాంత ఆచార్యుడు సత్యవాడ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రపంచ విజ్ఞానమంతా సంస్కృత భాషలో ఇమిడి ఉందన్నారు. అన్ని భాషలు, శాస్త్రాలతో సంస్కృతానికి సంబంధం ఉన్న నేపథ్యంలో విద్యార్థులు దీనిపై పట్టు సాధించాలని సూచించారు. అనంతరం ఆయనను కళాశాల యాజమాన్య ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు డి.దక్షిణామూర్తి, ప్రిన్సిపాల్ కె.ఎస్.బోస్ తదితరులు పాల్గొన్నారు.

'పరిష్కార వేదిక'కు 10 వినతులు



అర్జీదారు సమస్యలు తెలుసుకుంటన్న తహసీల్దార్ రమేష్

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 10 వినతులు అందాయి. అర్జీదారుల వద్ద నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎం.రమేష్ స్వీకరించి, వారి సమస్యలు తెలుసుకున్నారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎ.త్రినాథ్, ఆర్ఐ ఇబ్రహీం, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న వైద్యుల ఆందోళన

మహారాణిపేట: కేజీహెచ్‌లో జూనియర్ వైద్యుల ఆందోళన కొనసాగుతోంది. ఆంధ్రా మెడికల్ కాలేజీ నుంచి కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం వరకు సోమవారం ర్యాలీ నిర్వహించి.. కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. కాగా.. జూనియర్ వైద్యుల ఆందోళనతో కేజీహెచ్‌కు రోగుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. వచ్చిన రోగులకు వైద్య సేవలందించేందుకు సూపరింటెండెంట్ పి.శివానంద్ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. 1,407 మందికి ఓపీ సేవలందించామన్నారు. 26 మేజర్, 9 మైనర్ సర్జరీలు చేసినట్లు తెలిపారు. నిరసనలో జూనియర్ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ టి.పృథ్వీరాజ్, ఉపాధ్యక్షురాలు ఆర్.ఊహ, కార్యదర్శి వివేక్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సంయుక్త తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరి

ఆరిలోవ: జిల్లాలో పాడి పశువులకు రైతులు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ అన్నారు. జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి సెప్టెంబర్ 18 వరకు పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నారు. కలెక్టరేట్‌లో సోమవారం పశు సంవర్ధక శాఖ అధికారులతో కలిసి కలెక్టర్ కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పశువులకు వేసే గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ వ్యాధి సోకిన పాడి పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గిపోయి రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదముందన్నారు. పాడి రైతులు అప్రమత్తమై ముందు జాగ్రత్తగా పశువులకు టీకాలు వేయించాలని సూచించారు. టీకాలు వేయడానికి గ్రామాలకు వచ్చే పశు వైద్య సిబ్బందికి పాడి రైతులు సహకరించాలని కోరారు. నూరు శాతం టీకాలు వేయడానికి అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ, ఉప సంచాలకులు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ కరుణాకర రావు, సహాయ సంచాలకులు సజ్జ శ్రీనివాస్, డాక్టర్ మాదిన ప్రసాదరావు పాల్గొన్నారు.



ఉచిత టీకాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, జేడీ రామకృష్ణ

ఉన్నత శిఖరాలే విద్యార్థుల లక్ష్యం

మద్దిలపాలెం: విద్యార్థులు ఉన్నత శిఖరాల్లో నిలవాలని శ్రీ కాశ్యప్ కళాశాల కరస్పాండెంట్ టి.ఆర్.ఎస్.వర్మ, డైరెక్టర్లు ఎస్.నారాయణమూర్తి, ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి, సత్యనారాయణ ఆకాంక్షించారు. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో సోమవారం శ్రీ కాశ్యప్ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, కళాశాలకు పేరుప్రతిష్టలు తేవాలని కోరారు. ప్రతి విద్యార్థి సమస్యను చూసి భయపడకుండా.. దాని పరిష్కార మార్గం తెలుసుకోవాలని సూచించారు. ఫ్రెషర్స్‌డే వేడుకల్లో విద్యార్థులు సందడి చేశారు. సంప్రదాయ, వెస్ట్రన్ నృత్యాలతో అలరించారు. సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థినులు నిర్వహించిన ర్యాంప్ వాక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉత్తమ ప్రదర్శనకు కళాశాల యాజమాన్యం బహుమతులు అందజేసింది. విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నృత్యంతో అలరిస్తున్న విద్యార్థినులు

బకాయి వేతనాలు చెల్లించాలని నిరసన

ఎంవీపీకాలనీ: రెండు నెలల బకాయి వేతనాలు చెల్లించాలంటూ టీబీ హాస్పిటల్ కాంట్రాక్ట్ కార్మికులు సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. టీబీ ఆస్పత్రి ప్రధాన ద్వారం వద్ద సీఐటీయూ నాయకులతో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పి.వెంకటరావు మాట్లాడుతూ జీవో ప్రకారం కాంట్రాక్ట్ ఉద్యోగులకు రూ.16 వేల వేతనం చెల్లించాలని, షిఫ్ట్ టైమింగ్స్ మార్చాలని డిమాండ్ చేశారు. రెండు నెలలుగా ఉద్యోగులకు జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. తక్షణమే యాజమాన్యం స్పందించి జీతాలు చెల్లించాలన్నారు. టీబీ హాస్పిటల్‌లో అధిక గంటలు పనిచేయించడం దుర్మార్గమని, ఈ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



టీబీ హాస్పిటల్ వద్ద నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

తోపుడుబళ్ల కార్మికుల ఉపాధిని కాపాడాలి

మద్దిలపాలెం: జాతీయ రహదారిపై మద్దిలపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద తోపుడుబళ్లపై చిరువ్యాపారాలు చేసుకుంటున్న 32 మంది కార్మికుల ఉపాధిని కాపాడాలని సీఐటీయూ నాయకుడు అనపర్తి అప్పారావు, విశాఖ జిల్లా తోపుడుబండ్ల కార్మిక సంఘం కార్యదర్శి ఎ.సింహచలం విజ్ఞప్తి చేశారు. మద్దిలపాలెం కాంప్లెక్స్ వద్ద సోమవారం 32 మంది తోపుడుబళ్ల కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2014 స్ట్రీట్ వెండర్స్ చట్టం ప్రకారం ఈ ప్రాంతాన్ని హాకర్ జోన్‌గా ప్రకటించారని, ఇక్కడ తోపుడుబండ్ల వ్యాపారం కొనసాగించడానికి పూర్తి అవకాశమివ్వాలన్నారు. హాకర్ జోన్‌లో 32 మంది కార్మికులకు షెడ్‌లు వేసి విద్యుత్, తాగునీరు సదుపాయం కల్పించాలని కోరారు. ఆర్అండ్‌బీ స్థలంలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా 30 ఏళ్లుగా జీవిస్తున్నామని, తోపుడుబళ్లను తొలగిస్తే పోరాటం తప్పదని హెచ్చరించారు. ఆర్టీసీ యాజమాన్యం టెండర్లు పిలిచి, ఆర్అండ్‌బీ స్థలంలో షాపులు నిర్మించి హైవే ఫేసింగ్‌లో ప్రారంభించాలని చూస్తోందని, ఇలా చేస్తే తోపుడుబళ్లకు రక్షణ ఉండదని వాపోయారు. సీఐటీయూ నాయకులు కె.కుమారి, తోపుడుబండ్ల సంఘం అధ్యక్షుడు కోలా శ్రీను, కార్యదర్శి కుమార్, నాయకులు సాయి, గణేష్ పాల్గొన్నారు.

నర్సుల నిరసన

మహారాణిపేట: వైద్యురాలిపై జరిగిన లైంగిక దాడి, హత్యకు నిరసనగా సోమవారం ప్రైవేట్ నర్సింగ్ కళాశాల విద్యార్థులు, నర్సులు బీచ్‌రోడ్డులో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, నర్సుల సంఘం ప్రతినిధులు భవాని, వరలక్ష్మి, బి.భాగ్యలక్ష్మి, ప్రైవేట్ నర్సింగ్ స్కూల్స్ అండ్ కాలేజీ మేనేజ్‌మెంట్ అధ్యక్షురాలు సునీత రెడ్డి, కార్యదర్శి సునీల్ తదితరులు పాల్గొన్నారు.



బీచ్‌రోడ్డులో నిరసన ప్రదర్శన చేస్తున్న ప్రైవేట్ కాలేజీల నర్సులు

ఆత్మీయంగా రక్షాబంధన్ వేడుక



ఆరిలోవలో సోదరుడికి రాఖీ కడుతున్న అక్కాచెల్లెళ్లు



ఎంవీపీలో వృక్షానికి అర్జున రాఖీ కడుతున్న విద్యార్థులు

ఆరిలోవ: ఆరిలోవలో రక్షాబంధన్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. అన్నదమ్ములకు అక్కచెల్లెల్లు రాఖీలు కట్టి సోదరభావం చాటారు. ప్రతి ఇంటి వద్ద సందడి వాతావరణం నెలకొంది. దూర ప్రాంతాల్లో ఉన్న అన్నదమ్ముల ఇళ్లకు అక్కచెల్లెళ్లు వేకువజామునే చేరుకొని రాఖీలు కట్టి, స్వీట్లు తినిపించి ఆశీస్సులు, కానుకలు పొందారు. ఆరిలోవ, పెదగదిలి, చినగదిలి, తోటగరువు, బాలాజీనగర్, రవీంద్రనగర్, ఆదర్శనగర్, విశాలాక్షినగర్ తదితర ప్రాంతాల్లో రాఖీ పండగను ఆత్మీయ, ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.

గ్రీన్ క్లైమేట్ ఆధ్వర్యంలో వృక్షాబంధన్

ఎంవీపీకాలనీ: గ్రీన్ క్లైమేట్ టీం ఆధ్వర్యంలో సోమవారం వృక్షాబంధన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎంవీపీ కాలనీ వీఎంసీ డిగ్రీ కళాశాల, ఏఎస్ రాజా కళాశాలల్లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న వృక్షాలకు టీం సభ్యులు, కళాశాల విద్యార్థులు అర్జున రాఖీలు కట్టారు. కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు మాట్లాడుతూ వృక్ష సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి విద్యార్థిపై ఉందన్నారు. భారీ వృక్షాలను సంరక్షిస్తూ భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ ప్రతినిధి రత్నం తదితరులు పాల్గొన్నారు.

గాంధీ సెంటర్‌లో..

సీతంపేట: ప్రజాపిత బ్రహ్మకుమారి సంస్థ, ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడం సంయుక్తంగా సోమవారం బుల్లయ్య కళాశాల ప్రాంగణంలోని గాంధీ సెంటర్‌లో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. బ్రహ్మకుమారి సభ్యులు రమ తదితరులు గాంధీ సెంటర్ అధ్యక్షులు ఆచార్య వి.బాలమోహన్ దాస్, నరవ ప్రకాశరావులకు రాఖీలు కట్టి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా బాలమోహన్ దాస్ మాట్లాడుతూ రక్షాబంధన్ జరుపుకోవడం ద్వారా మానవతా విలువలు, అన్నాచెల్లెల్ల అనుబంధం వారి రక్షణకు పునరంకితం కావాలన్నారు. కార్యక్రమంలో హుస్సేన్, అహ్మద్ మున్నార్, చాట్ల బాబూరావు, కె.వి.ఎస్.ఎన్.మూర్తి, హరగోపాల్, ఉండవల్లి సుజాత పాల్గొన్నారు.



ఆచార్య బాలమోహన్‌దాస్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి రమ

మాదక ద్రవ్యాలతో యువత భవిష్యత్ ప్రశ్నార్థకం



మాట్లాడుతున్న ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి

దాబాగార్డెన్స్: యువత భవిష్యత్ ప్రమాదంలో ఉందని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ అన్నెపు నర్సింహమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు అధ్యక్షతన 'మాదక ద్రవ్యాల వినియోగం– విష సంస్కృతి, ప్రమాదంలో యువత భవిష్యత్' అనే అంశంపై సోమవారం దాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహించారు. మాదక ద్రవ్యాలు సేవించే వారి కుటుంబ సభ్యుల ఆవేదనను కామేశ్వరరావు తెలియజేశారు. మానసిక వైద్యుడు డాక్టర్ ఎన్.ఎన్.రాజు మాదక ద్రవ్యాలను యువత ఏవిధంగా అలవాటు చేసుకుంటున్నారో వివరించారు. డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయబాబు తదితరులు మాట్లాడారు.

విశాఖ–భగత్ కి కోఠి ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం: పశ్చిమ మధ్య రైల్వే, జబల్‌పూర్ డివిజన్ కట్నిముర్వారా–బినా సెక్షన్‌ల పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్త ఈ మార్గంలో నడిచే విశాఖపట్నం–భగత్ కి కోఠి–విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు. విశాఖపట్నం –భగత్ కి కోఠి (18573) వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 29న, భగత్ కి కోఠి –విశాఖపట్నం (18574) వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 31న రద్దు చేయబడింది.

31న మహిళా న్యాయవాదులకు వర్క్‌షాప్

సీతంపేట: మహిళా న్యాయవాదులకు ఈ నెల 31న వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో వర్క్ షాప్ నిర్వహించనున్నట్లు మహిళా న్యాయవాదుల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పప్పు అనూరాధ, పి.హేమమాలిని తెలిపారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో సోమవారం విలేకరులతో వారు మాట్లాడారు. వర్క్ షాప్‌నకు ముఖ్య అతిథిగా ఏపీ హైకోర్టు న్యాయమూర్తి వి.ఎస్.భానుమతి, గౌరవ అతిథిగా తెలంగాణ హైకోర్టు జడ్జి ప్రియదర్శిని, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి, విశాఖ జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి రవినాథ్, విశాఖ బార్ అసోసియేషన్ ప్రముఖులు హాజరుకానున్నారని తెలిపారు. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ మంగళవారం ఉదయం 11 గంటలకు జిల్లా కోర్టు నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు నిరసన ర్యాలీ చేపడుతున్నట్టు తెలిపారు. మహిళా న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలపాలని కోరారు. ఈసమావేశంలో కోశాధికారి బి.రమాదేవి, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయవాదులు అనూరాధ, హేమమాలిని

పవర్ లిఫ్టింగ్‌లో 12 మందికి పతకాలు



పతకాలు సాధించిన విజేతలను అభినందిస్తున్న మధుకుమార్ తదితరులు

సీతంపేట: విశాఖ జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఇటీవల నగరంలో నిర్వహించిన పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ పురుషులు, మహిళల పోటీల్లో బుల్లయ్య కళాశాల జూనియర్, డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులు 12 మంది పతకాలు సాధించారు. పలు విభాగాల్లో 5 బంగారు, 4 రజత, 3 కాంస్య పతకాలతో సత్తా చాటారు. ఈ సందర్భంగా సోమవారం వీరిని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్, ప్రిన్సిపాళ్లు జి.ఎస్.కె.చక్రవర్తి, డి.దీపక్ చౌదరి, కె.సోమేశ్వరరెడ్డి, అసిస్టెంట్ డీన్ టి.బ్రహ్మానందరెడ్డి, వ్యాయామ విభాగాధిపతి వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్లు బి.ఆర్.ఎస్.లక్ష్మణరెడ్డి, గంగాభవాని అభినందించారు.